సాక్షి
తిరుపతి
శుక్రవారం । 27 । జూన్ । 2025



గ్రీవెన్స్‌కు నోడల్ అధికారులు

గ్రీవెన్స్ కార్యక్రమానికి మండలానికి ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేయాలని చీఫ్ కమిషనర్ జయలక్ష్మి పేర్కొన్నారు. - 8లో



అక్రమాలకు 'ఉపాధి'

పేదలకు కడుపు నింపాల్సిన ఉపాధిహామీ పనులు కొంత మంది టీడీపీ నేతలకు ఫలహారంగా మారుతున్నాయి. - 8లో



మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఏరియా ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

పలు కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో మాస్టర్ ఆఫ్ కామర్స్, ఎంఏ తెలుగు, డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం)లో ప్రవేశానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారం, అర్హత, కోర్సులు, ఫీజు వంటి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, స్పాట్ అడ్మిషన్ల కోసం సెప్టెంబర్ 15లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 0877-2284524, 8121787415ను సంప్రదించాలని సూచించారు.

రేపు జాబ్‌మేళా

తిరుపతి అర్బన్ : తిరుపతిలోని పద్మావతిపురం ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి జాబ్ మేళా ఉంటుందని చెప్పారు. పలు బహుళజాతి కంపెనీలకు చెందిన వారు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి హాజరు కానున్నారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా చదువుకున్న యువత అర్హులుగా పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే నిరుద్యోగులు ముందుగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 85559 72657, 99888 53335 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

టీటీడీ ఉద్యోగులకు హెల్మెట్ల పంపిణీ



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న చైర్మన్

తిరుమల : టీటీడీ ఉద్యోగులకు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి గురువారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవలే 500 హెల్మెట్లు పంపిణీ చేశామని, అమాలాపురానికి చెందిన నిమ్మకాయల సత్యనారాయణ, హైదరాబాద్‌కు చెందిన నాగేంద్ర ప్రసాద్ అనే దాతలు విరాళంగా ఇచ్చిన 2 వేల హెల్మెట్లు ప్రస్తుతం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మరో 7500 హెల్మెట్లు టీటీడీ ఉద్యోగులకు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్లు ధరించాలని కోరారు. టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ మాట్లాడుతూ.. హెల్మెట్లు ధరించి ప్రయాణం చేయడం వల్ల ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రాజేంద్ర, వీజీవో సదా లక్ష్మి, అన్న ప్రసాదం స్పెషల్ ఆఫీసర్ శాస్త్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.





నాగలాపురం : రాజులకండ్రిగ వద్ద ఎర్ర మట్టిని లోడింగ్ చేస్తున్న టిప్పర్లు (ఇన్‌సెట్) వరదయ్యపాళెం : బత్తలవల్లం వద్ద టిప్పర్లకు నింపుతున్న గ్రావెల్ మట్టి

పచ్చనేతల మట్టి మాఫియా!

ధనార్జనే ధ్యేయంగా జిల్లాలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అధికారులు, అధికారాన్ని అడ్డంపెట్టుకొని తెలుగు తమ్ముళ్లు అడ్డదిడ్డంగా ఎర్రమట్టిని సత్యవేడు నుంచి తమిళనాడు సరిహద్దులు దాటిస్తూ రూ.కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. రోజూ వందల సంఖ్యలో టిప్పర్లతో ఎర్రమట్టిని తరలిస్తూ దోపిడీ చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున అక్రమంగా మట్టి దోపిడీ సాగిస్తున్నా అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. విలువైన ప్రకృతి సంపద అక్రమంగా తరలిపోతుండడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సత్యవేడులో చెలరేగిపోతున్న అక్రమార్కులు
- రోజూ వందల లారీలు సరిహద్దు దాటుతున్న వైనం
- చోద్యం చూస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు
- టీడీపీ నేతల కనుసన్నల్లో గ్రావెల్ మట్టి వ్యాపారం
- తెలుగుగంగ కాలువను కొల్లగొడుతున్న పచ్చనేతలు

వరదయ్యపాళెం : కూటమి ప్రభుత్వంలో మట్టి మాఫియా అడ్డూ అదుపు లేకుండా చెలరేగిపోతోంది. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు కేంద్రంగా టీడీపీ కీలక నేతల కనుసన్నల్లో మాఫియా జోరుగా సాగుతోంది. కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి మొదలైన గ్రావెల్ అక్రమ రవాణా మూడు నెలలుగా ఊపందుకుంది. ప్రధానంగా సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల కేంద్రంగా గ్రావెల్ మాఫియా దందా సాగిస్తోంది. రోజువారీగా వందల టిప్పర్లు తమిళనాడు సరిహద్దు దాటిస్తూ సత్యవేడు ప్రాంత సంపదను దోచుకుంటున్నారు. కట్టడి చేయాల్సిన రెవెన్యూ, పోలీస్, మైన్స్ యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అనుమతి పేరుతో దోపిడీ

తమిళనాడులో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆంధ్రా మట్టిని తరలించేందుకు టీడీపీ నేతలు అక్రమ అనుమతులు పొందుతున్నారు. తమిళనాడులోని పొన్నేరి, ఎన్నూరు పోర్టు, ఇతర ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి పనులకు ఆంధ్రా మట్టిని తరలించేందుకు జిల్లాలోని మైన్స్ అధికారులు, కూటమి నేతల ఒత్తిళ్లకు లోనై గుడ్డిగా అనుమతులు ఇస్తుండడం స్థానిక ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు ఇచ్చేది గోరంతైతే తవ్వకాలు జరిపి తరలించేది కొండంత. దీంతో అక్రమ రవాణాకు అధికారులే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వెనుక అధికార టీడీపీ నేతలు కుమ్మక్కై దోచేస్తున్నారు.



సత్యవేడు : వీఆర్‌కండ్రిగ వద్ద తమిళనాడుకు మట్టిని తరలించేందుకు సిద్ధంగా టిప్పర్లు

అధికార పార్టీ నేతల ఆగడాలు

ఏకంగా సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలంలోని రాజులకండ్రిగ వద్ద పెద్ద ఎత్తున మట్టిని తమిళనాడుకు తరలిస్తున్నారు. రోజువారీ వందల లారీలు రాజులకండ్రిగ నుంచి తమిళనాడుకు మట్టి తరలిస్తుండడంతో ఈ పరిణామాలను సాక్షాత్తు ఆ మండల టీడీపీ నేతలు వ్యతిరేకిస్తున్నారు. టీడీపీ జెండాలు పట్టుకుని మరి రాజులకండ్రిగ వద్ద జరుగుతున్న గ్రావెల్ అక్రమ రవాణా వద్ద తాజాగా 10 రోజుల క్రితం పెద్ద ఎత్తున నిరసనలు తెలపడం గమనార్హం. కూటమి ప్రభుత్వ ఆగడాలకు సొంత టీడీపీ పార్టీ నుంచే విమర్శలు వస్తున్నాయంటే మట్టి మాఫియా ఆగడాలు ఏమాత్రం ఉన్నాయో ఊహించవచ్చు.

తమిళనాడులో భలే గిరాకీ

సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు రాష్ట్రం నుంచి తమిళనాడుకు తరలిస్తున్న ఎర్రమట్టికి తమిళనాడులో మంచి గిరాకీ ఉంది. 70 టన్నులు బరువుతో వెళ్లే టిప్పర్ లారీ రూ.40 వేలకు పైగా ధర పలుకుతోంది. దీంతో ఎక్కడ లేని గిరాకీ ఆంధ్రా మట్టికి నెలకొనడంతో టీడీపీ కీలక నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది.

తెలుగుగంగ అధికారుల నిర్లక్ష్యం

తెలుగు గంగ కాలువ గట్లను బహిరంగంగా గ్రావెల్ మాఫియా కొల్లగొడుతున్నప్పటికీ కాలువ పర్యవేక్షణ చేసే అధికారులు పత్తా లేకుండా పోయారు. అధికార టీడీపీ మాయలో పడిన వారు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అధికారుల అలసత్వానికి భవిష్యత్తులో కాలువల నిర్వహణ ప్రశ్నార్థకం కానుంది. అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు మండిపడుతున్నారు.

సత్యవేడు నియోజకవర్గంలో గ్రావెల్ అక్రమ రవాణా జరిగే ప్రాంతాలు

మండలం	గ్రావెల్ అక్రమ రవాణా జరిగే ప్రాంతాలు
సత్యవేడు	వీఆర్‌కండ్రిగ, మదనంజేరి, తొండుకులి, బాలకృష్ణాపురం
నాగలాపురం	రాజులకండ్రిగ
వరదయ్యపాళెం	బత్తలవల్లం, చెదులుపాకం, పులివల్లం

కాలువ గట్లను కొల్లగొట్టి..

చెరువులు, ప్రభుత్వ ఖాళీ భూములు నుంచి గ్రావెల్ మట్టిని కొల్లగొడుతున్నారు. అది చాలక ఏకంగా తమిళనాడుకు వెళ్లే తెలుగుగంగ ప్రధాన కాలువ గట్టులను కొల్లగొట్టి మట్టిని తమిళనాడుకు తరలించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. తమిళనాడు తాగునీటి అవసరాలకు ఎంతో కీలకంగా ఏర్పాటైన తెలుగు గంగ కాలువ గట్లను ఇంతలా కొల్లగొట్టడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాలువ గట్లను తొలగిస్తే భవిష్యత్తులో కాలువ పూడిపోవడం ఖాయమని స్థానికులు చెబుతున్నారు. ప్రధానంగా సత్యవేడు పరిసర ప్రాంతాలు నెల్లూరు, పెద్దఈటిపాకం, జీరో పాయింట్ వద్ద తెలుగు గంగ కాలువ గట్లను ధ్వంసం చేస్తూ గ్రావెల్ మట్టిని తమిళనాడుకు తరలించి రూ.లక్షలు దోచుకుంటున్నారు.

నన్నాపేదెవడ్రా?

శ్రీకాళహస్తి: మండలంలోని చుక్కలనిడిగల్లు గ్రామంలో మట్టిమాఫియా రెచ్చిపోతోంది. స్థానిక టీడీపీ నాయకుడి కనుసన్నల్లో మట్టి, ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇతరులు ఎవరైనా ఇసుక, మట్టి ఎత్తితే పోలీసులకు చెప్పించి వారిని పట్టించేయడం రివాజుగా మారుతోంది. ఓ ప్రైవేటు వెంచర్ కోసం చుక్కల నిడిగల్లు చెరువులోని మట్టిని జేసీబీలతో తవ్వి నిరంతరాయంగా తరలిస్తున్నా అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. రోజుకు వంద నుంచి 150 ట్రిప్పుల మట్టి తరలిస్తున్నారు. దీనిపై స్థానికులు ప్రశ్నిస్తే తమకు అధికారులు, పెద్ద నాయకుల అండదండలు ఉన్నాయంటూ బెదిరింపులకు దిగుతున్నట్టు సమాచారం.



చెరువులోని మట్టిని జేసీబీతో ట్రాక్టర్లకు నింపుతున్న దృశ్యం

పదవులతో పార్టీని బలోపేతం చేయండి

నగరి: పార్టీ ఇచ్చిన పదవులను బాధ్యతగా భావించి, క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమితులైన చిరంజీవి పార్టీ నేతలతో మాజీమంత్రి నివాసానికి విచ్చేసి ఆమెను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రోజా వారితో మాట్లాడుతూ పార్టీ గుర్తించి ఇచ్చిన పదవులను ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు అండగా నిలబడి వారి తరఫున పోరాడాలన్నారు. ప్రభుత్వం చేసే తప్పులను ఎప్పటికప్పుడు ఎండ కడుతూ పేదవారికి న్యాయం జరిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ మంత్రి ఆర్కే రోజాను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

నాణ్యతలేని సరుకులపై ప్రత్యేక నిఘా

తిరుపతి అర్బన్ : నాణ్యతలేని సరుకులు వస్తే వాటిని తిప్పి పంపుతున్నామని సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ బి.బాలకృష్ణ పేర్కొన్నారు. సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన పురుగు పట్టిన పోషణ అనే కథనంపై ఆయన ఓ ప్రకటనలో స్పందించారు. కందిపప్పు సప్లయర్ మిలాప్ ట్రేడ్ లింక్ విజయవాడ వారితోను గురువారం మాట్లాడినట్లు వెల్లడించారు. నాణ్యమైన సరుకులు మాత్రమే జిల్లాకు పంపాలని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని గోదాముల ఇన్‌చార్జులు నాణ్యమైన సరుకులు మాత్రమే డీలర్లు, పాఠశాలలు, అంగన్‌వాడీలకు పంపాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. సరుకుల నాణ్యతను తనిఖీ చేయడానికి నలుగురు టెక్నికల్ అసిస్టెంట్స్ పనిచేస్తున్నారని చెప్పారు. నాణ్యతలేని ఏ సరుకులు వచ్చినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆ మేరకు ప్రత్యేక నిఘా ఉంచామని వివరించారు.

యువత సన్మార్గంలో నడవాలి



ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కమిషనర్

తిరుపతి అర్బన్ : యువత సన్మార్గంలో నడిచినప్పుడే దేశం అభివృద్ధిలో ముందుకు సాగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని ఆర్డీవో కార్యాలయం నుంచి ర్యాలీగా ఎంఆర్‌పల్లి సర్కిల్ వరకు వెళ్లారు. ఎంఆర్‌పల్లి సర్కిల్‌లో మానవహారం చేపట్టారు. తర్వాత శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొందరు యువకులు డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాల ఊబిలో చిక్కుకుంటున్నారన్నారు. ఈ క్రమంలో యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. ప్రతి పౌరుడు ముందుకు వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. డ్రగ్స్ వద్దు...జీవితమే ముద్దు అంటూ విద్యార్థులతో నినాదాలు చేయించారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. తల్లిదండ్రులు మంచి మార్గంలో ముందుకు సాగడంతోనే భవిష్యత్తు బాగుంటుందని గుర్తుచేశారు. ప్రతి విద్యార్థి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునిక్రిష్ణ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.

తల్లికి కూటమి పరీక్ష



పాలసముద్రం సచివాలయంలో తల్లికి వందనం అర్జీలు ఇస్తున్న తల్లిదండ్రులు

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది తల్లికి వందనం ఎగ్గొట్టేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఏ ముహూర్తాన ఈ పథకం అమలు చేసిందో కానీ క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లులు సమస్యలతో అల్లాడుతున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో చాలా మంది అర్హులకు ఈ పథకంలో కోత విధించారు. గతంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం పథకంలో అనర్హులుగా గుర్తించారు. అలాగే విద్యుత్ బిల్లులు, కారు, ఐటీ వంటివి వర్తించనప్పటికీ చాలా మందిని అనర్హుల జాబితాలో చేర్చారు. దీంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని సచివాలయాల వద్ద అనర్హుల జాబితాలో ఉన్న తల్లులు అర్జీలను చేతపట్టుకుని క్యూ కట్టారు. ఈ పరిస్థితి చూస్తుంటే కూటమి ప్రభుత్వం తల్లులకు పరీక్ష పెట్టినట్టుంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తల్లికి వందనం పథకంలో అనర్హులైన తల్లుల కష్టాలపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ కథనం.

- సచివాలయాల వద్ద క్యూ కట్టిన అనర్హులు
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీగా అర్జీలు
- రెండు జిల్లాల్లో 12 వేలకు పైగా దరఖాస్తులు
- అధికంగా విద్యుత్ బిల్లులు, కారు, ఐటీ కారణాలు
- వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో పారదర్శకంగా అమ్మఒడి

చిత్తూరు కలెక్టరేట్ : తల్లికి వందనం పథకం.. తల్లులకు పరీక్షగా మారింది. పలు రకాల కారణాలతో పథకం అమలు కాకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. మొదటి జాబితాలో పథకం వర్తించని పిల్లలు రెండో జాబితాకు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే సచివాలయాల్లో గ్రీవెన్స్ స్వీకరిస్తుండడంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు అందజేస్తున్నారు. ఎవరు ఏ సమస్యతో అనర్హత జాబితాలో ఉన్నారో పేర్ల వారీగా వివరణ ఉన్న జాబితాలను ఇప్పటికే సచివాలయాల్లో ప్రదర్శించడంతో వాటి ఆధారంగా తగు పత్రాలను జతచేసి గ్రీవెన్స్‌కు దరఖాస్తులు ఇస్తున్నారు. ఈ క్రమంలో జత చేయాల్సిన పత్రాల కోసం రెండు జిల్లాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తల్లులు చక్కర్లు కొడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి పథకం ఏటా పకడ్బందీగా అమలు చేశారు. తల్లులకు ఎలాంటి సమస్యలు లేకుండా పారదర్శకంగా ఎంపిక చేసి, నేరుగా ఖాతాల్లో నగదు జమ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేసిన మొదటి సారే గందరగోళ పరిస్థితి నెలకొంది.

సర్టిఫికెట్లకు ఇబ్బందులు

చిత్తూరు జిల్లాలో మొత్తం 1,30,382 మందిని, తిరుపతి జిల్లాలో 2,10,407అర్హులుగా గుర్తించారు. ఈ రెండు జిల్లాల్లో దాదాపు 98748 మంది అనర్హుల జాబితాలో ఉన్నారు. రెండు జిల్లాల్లో అధిక శాతం మందికి విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ కాలేదు. ఇంకా సగం మందికిపైగా సవరణ/ ఫిర్యాదు దరఖాస్తులు సమర్పించాల్సి ఉందని తెలుస్తోంది. వేలల్లో అనర్హులుంటే కేవలం 12,589 అర్జీలు రావడమే అందుకు ఉదాహరణ. సచివాలయ సిబ్బందికి తల్లికి వందనం గ్రీవెన్స్‌పై అవగాహన లేకపోవడంతో ఆయా కార్యాలయాల్లో సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు.

వేల సంఖ్యలో పోటెత్తిన అర్జీలు

'తల్లికి వందనం' పథకం తమకు వర్తింపజేయాలంటూ చిత్తూరు, తిరుపతి జిల్లాల వ్యాప్తంగా వేల సంఖ్యలో అర్జీలు పోటెత్తుతున్నాయి. తమకు అర్హత ఉన్నా పలు కారణాలతో జాబితాలో పేర్లు లేకుండా చేశారంటూ వేలాది మంది తల్లులు సచివాలయాలకు క్యూకడుతున్నారు. ఎప్పుడో కారు విక్రయించినా కారు ఉందనే సాకుతో పథకం నుంచి తొలగించారని కొందరు.. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు అధికంగా చూపడంతో డబ్బులు పడలేదని మరికొందరు.. మూడేళ్ల కింద ఆదాయపు పన్ను చూపించి డబ్బులివ్వలేదని ఇంకొందరు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలు, రేషన్‌కార్డు సమస్యలున్న కుటుంబాలు ఇలా రకరకాల కారణాలతో తమను పథకానికి దూరం చేశారంటూ వాపోతున్నారు. అర్హులుగా నిర్ధారించి డబ్బులివ్వాలంటూ దరఖాస్తులు చేస్తున్నారు. దీంతో ఇప్పటివరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 12,589 మంది తల్లులు అర్జీలు దాఖలు చేశారు. వీరిలో అర్హులుంటే వచ్చేనెల 5వ తేదీన తిరిగి ప్రభుత్వం డబ్బులు జమచేయనుంది. ఈ నేపథ్యంలో అధికారులు మళ్లీ ఈ అర్జీలను పునఃపరిశీలిస్తున్నారు. ఈ పథకంలో సమస్యలు ఎదుర్కొంటున్న తల్లులకు క్షేత్రస్థాయిలో సరైన అవగాహన కల్పించడంలో జిల్లా యంత్రాంగం విఫలమైనట్లు కొట్టొచ్చినట్లు తెలుస్తోంది.

రెండు జిల్లాల్లో 12,589 అర్జీలు

చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని సచివాలయాల పరిధిలో 1,327 సచివాలయాల పరిధిలో 12,589 అర్జీలు పోటెత్తాయి. ఒక్క చిత్తూరు జిల్లాలోని 612 సచివాలయాల పరిధిలో 5,897 వరకు అర్జీలు వచ్చాయి. అర్జీల్లో ఎక్కువశాతం విద్యుత్ బిల్లుకు సంబంధించినవే. పథకం వర్తించని వారు బిల్లులు తీసుకుని అర్జీలతో జత చేయడం విశేషం . ఒక్క చిత్తూరు జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో సీడింగ్ సమస్య అర్జీలు 1,789 వరకు ఉండగా, తిరుపతి జిల్లాలో 1,815 వరకు ఉన్నాయి. తమ కారు విక్రయించినా పథకం అమలు కాలేదని అనేక అర్జీల్లో తల్లులు ప్రస్తావించారు. ఆదాయ పన్ను దరఖాస్తులదీ ఇదే తీరు. వివాహం తర్వాత తాము కుటుంబం నుంచి విడిపోయి విడిగా ఉంటున్నా ఉమ్మడి కుటుంబ సభ్యుల ఆదాయం చూపించి తీసేశారంటూ అర్జీల్లో అనేక మంది పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అనేక మంది అర్జీలు దాఖలు చేశారు.

పరిశీలనలో అలసత్వం

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాల్సి ఉంది. అయితే ఆయా శాఖల అధికారులు పరిశీలనలో అలసత్వం చూపిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కారు సంబంధిత అర్జీ సమస్యను ఆయా జిల్లా రవాణా శాఖకు నేరుగా సచివాలయాలు పంపి ఆరా తీస్తున్నాయి. అయితే ఆ అర్జీల పరిష్కారంలో ముందడుగు పడడం లేదు. ఆదాయ పన్ను అర్జీలను తహసీల్దార్లకు లాగిన్‌లో పంపుతున్నారు. ఆ అర్జీలను తహసీల్దార్లు అస్సలు పట్టించుకోవడం లేదు. కొంత మంది తహసీల్దార్లు పరిష్కరించి ఆర్డీఓ లాగిన్‌లకు పంపుతున్నారు. పనిఒత్తిడిలో ఉన్న ఆర్డీఓలు వాటిని పట్టించుకోని దుస్థితి ఉంది. విద్యుత్ బిల్లులకు సంబంధించిన అర్జీలను ఆ శాఖ అధికారులు తిరస్కరిస్తున్నారు. వీరికి పథకం వర్తించదని నిర్ధారించి, సచివాలయాల దశలోనే రెండోసారి అనర్హత కేటగిరీలో చేర్చుతున్నారు. ఈ నెలాఖరులోగా అర్హుల జాబితా పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే రెండు జిల్లాల్లో ఈ పథకంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించని దుస్థితి నెలకుంది.

క్లుప్తంగా

జేఈఈ టాపర్లకు కలెక్టర్ అభినందన


జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ టాపర్లతో కలెక్టర్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇటీవల ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన నారాయణ విద్యాసంస్థల విద్యార్థులను కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్లు భానుచరణ్‌రెడ్డి, మణిదీప్‌రెడ్డి, హిమేష్ రాఘవ, శశాంక్‌రెడ్డి, యశ్విత, నిఖిల్, నీట్ టాపర్లు జ్ఞానీష, మౌనిక, కీర్తి, విశ్వక్ అగర్వాల్‌ను కలెక్టర్ అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆ విద్యాసంస్థ డీజీఎం కొండలరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి అన్నమయ్య సర్కిల్: అక్రమంగా తరలిస్తున్న 10 ఎర్రచందనం దుంగలు బుధవారం రాత్రి రేణిగుంట – మామండూరు మార్గంలోని ఆంజనేయపురం వద్ద స్వాధీనం చేసుకున్నట్లు అటవీ క్షేత్రాధికారి బి.సుదర్శనరెడ్డి తెలిపారు. పెట్రోలింగ్ చేస్తుండగా అతి వేగంగా వస్తున్న కారును ఆపామని తెలిపారు. డ్రైవర్ వేగంగా దూసుకెళ్లాడని, దాన్ని వెంబడించడంతో డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయాడన్నారు. కారులో 294 కిలోల బరువు కలిగిన దుంగలను గుర్తించామన్నారు. వాటి విలువ సుమారు రూ.6.5 లక్షలుగా అంచనా వేశామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎఫ్ఎస్‌వో చైతన్య, కరకంబాడి ఎఫ్‌బీవో వెంకటేశ్వరరావు, ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రి, వెంకటేష్, ప్రసాద్, నవీన్, రవి పాల్గొన్నారు.

నేడు ఆర్ఏఆర్ఎస్‌లో జాతీయ సదస్సు

తిరుపతి సిటీ : స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు 'వ్యవసాయంలో సవాళ్లు, వాతావరణ అనుకూలత నూతన ఆవిష్కరణలు' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. సదస్సుకు దేశంలోని పలు వర్సిటీల నుంచి అధికారులు, ప్రధాన శాస్త్రవేత్తలు హాజరు కానున్నారు.

అక్రమాలకు ఉపాధి

ఉపాధిహామీ పనులు పచ్చనేతలకు ఫలహారంగా మారుతున్నాయి. గోకులం షెడ్లు చెరువులు, కుంటల్లో నిర్మించి అందిన కాడికి దోచేస్తున్నారు. అవసరంలేని చోట సీసీ రోడ్లు వేసి కాసులు కాజేస్తున్నారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడిన కొంత మంది అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పనులకు అనుమతులు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. అక్రమాలపై కేంద్ర ప్రభుత్వ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేస్తున్నా అక్రమాలపై విచారణ చేపట్టకపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది.

- ప్రహసనంగా సామాజిక తనిఖీలు
- అక్రమాలు బయటపడినా రికవరీ జోలికెళ్లని అధికారులు
- గోకులం షెడ్ల నిర్మాణంలో పాటించని నిబంధనలు
- పక్కదారి పట్టిన ఉపాధి హామీ పథకం లక్ష్యం
- జాతీయ స్థాయిలో ఫిర్యాదులు చేస్తున్న బాధితులు


టి.కుమ్మరపల్లి వద్ద చెరువును ఆక్రమించి అందులోనే గోకులం షెడ్డు నిర్మాణం చేసిన టీడీపీ నేత

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : పేద కూలీలకు ఉపాధిని కల్పించి వలసలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి పథకం (ఎన్ఆర్ఈజీఎస్) అవినీతి కంపుతో అపహాస్యం పాలవుతోంది. కొందరు అవినీతిపరులకు ఈ పథకం ఆదాయ వనరుగా మారింది. దొరికినంత దోచుకోవడం, ఆపై చేతులెత్తేయడం అలవాటుగా మార్చుకున్నారు. ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బంది, మండల స్థాయి అధికారులతో పాటు ఉన్నతాధికారులే అవినీతికి పరోక్ష సహకారం అందిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పశువుల నీడ కోసం పాడి రైతులు ఏర్పాటు చేసుకునే షెడ్ల (గోకులం) నిర్మాణంలో అక్రమాలకు పాల్పడటం, టీడీపీ నేతలు చెప్పిన వారికే ఇవ్వడం వంటి చర్యలతో అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన చెందుతున్నారు. ఉపాధి పనులపై తరచుగా నిర్వహించే సామాజిక తనిఖీలను ఉత్తుత్తిగా చేపట్టడం, అందులో బయటపడ్డ అక్రమాలు చేసిన వారి నుంచి రికవరీలు చేయకపోవడంతో అధికారులే అవినీతికి కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

అధికారులకు ఫిర్యాదుల వెల్లువ

ఉపాధి పనుల్లో అన్యాయం జరిగిన బాధిత కుటుంబాలు ఢిల్లీ అధికారులకు లేఖలు పంపించారంటే.. అక్కడ ఏ స్థాయిలో అవినీతి జరుగుతున్నాయో పనుల తీరుకు అద్దం పడుతున్నాయి. ఉపాధి పనుల్లో చోటు చేసుకున్న అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని వరుసగా ఫిర్యాదులు అందుతున్నా జిల్లా అధికారుల నుంచి స్పందన రాకపోవడం, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

నిజాలు నిగ్గు తేల్చండి

చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా జరిగిన ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని ఉపాధి పనుల్లో అన్యాయం జరిగిన పలువురు బాధితులు కేంద్రంలోని ఉపాధి హామీ పథకం ఉన్నతాధికారులకు, తిరుపతి జిల్లా కలెక్టర్‌కు పలు దఫాలుగా ఫిర్యాదులు అందించారు. ఉపాధి పనుల్లో జరిగే అవినీతికి సంబంధించిన ఆధారాలను సైతం కలెక్టర్‌కు అందజేసినట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు అక్రమాల బాగోతంపై విచారణకు ఆదేశించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

కమీషన్లకు కక్కుర్తిపడి

ఉపాధి నిధులతో అవసరం లేని చోట సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టి ఉపాధి నిధులను దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి నిధులపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి నిబంధనలకు విరుద్ధంగా పనులు చేసేందుకు అనుమతులు ఇచ్చేస్తున్నారన్న విమర్శలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. రైతులకు తెలియకుండానే వారి పొలాల చుట్టు సరిహద్దు కందకాలు (బౌండరీ ట్రెంచ్) తవ్వినట్టు బిల్లులు మంజూరు చేసి డబ్బులు దోచేస్తున్నారని పలువురు రైతులు గగ్గోలు పెడుతున్నారు.

నేతల కనుసన్నల్లో పనులు

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద అనేక రకాల అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఆ పనుల్లో ఆరంభం నుంచే అవినీతి చోటు చేసుకోవడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్నా క్షేత్ర సహాయకుల నుంచి మండల స్థాయిలో పనిచేసే ఏపీఓల వరకు అవినీతికి అండగా నిలబడటంతో ఆ పథకం లక్ష్యం పక్కదారి పడుతోందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో పనిచేస్తున్న ఫీల్డు అసిస్టెంట్లు, ఏపీఓలు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. స్థానిక టీడీపీ నేతల కనుసన్నల్లోనే గోకులం షెడ్లను మంజూరు చేయడం, అది కూడా అర్హత లేని వారికి గోకులం షెడ్లకు అనుమతించి అన్ని అర్హతలు ఉన్న వారిని పక్కన పెట్టారన్న విమర్శలు పెద్ద ఎత్తున వస్తున్నాయి.

కారు పార్కింగ్ షెడ్లుగా..

నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, వాగుల్లో గోకులం షెడ్లు నిర్మాణం చేసినప్పటికీ సంబంధిత అధికారులు వాటన్నింటికీ అనుమతులు ఇచ్చేయడం, బిల్లులు మంజూరు చేయడం అధికారుల బాధ్యతా రాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. పశువులు లేని కూటమి నేతలకు గోకులం షెడ్లు మంజూరు చేయడంతో వారు కారు పార్కింగ్ షెడ్లుగా వాటిని వాడుతున్నారు.


కొత్తపల్లికి చెందిన ఓ టీడీపీ నేత ఇంటి వద్ద కారు పార్కింగ్ కోసం నిర్మించుకున్న గోకులం షెడ్డు

అక్రమాలకు సంబంధించి ఆధారాలు ఇవిగో..

- చిన్నగొట్టిగల్లు మండలం చిన్నగొట్టిగల్లు పంచాయతీ టీ కుమ్మరపల్లి సమీపంలో అయ్యప్పరెడ్డి చెరువు సర్వే నంబర్ 1208లో టీడీపీకి చెందిన ఓ మైనారిటీ నేత 2 ఎకరాల చెరువు భూమి కబ్జా చేశారు. ఆ చెరువు భూమిలో రెండు గోకులం షెడ్డులు నిర్మించగా అక్కడి అధికారులు అన్ని విధాలుగా సహకరించారు.
- ఎర్రావారిపాళెం మండలం కొత్తపల్లికి చెందిన ఓ కూటమి నేతకు పశువులు లేనప్పటికీ గోకులం షెడ్డు మంజూరు చేశారు. షెడ్డు మంజూరుకు క్షేత్రస్థాయి సహాయకుడు జియో ట్యాగింగ్ చేయాల్సి వస్తే.. పక్కింటికి చెందిన వారి పశువులను ఫొటో తీసి అప్‌లోడ్ చేయించి షెడ్డు మంజూరు చేశారు. ఆ నాయకుడు ప్రస్తుతం గోకులం షెడ్డును కారు పార్కింగ్‌కు వినియోగిస్తున్నాడు.
- ఎర్రావారిపాళెం మండలం నెరబైలు పంచాయతీ పాత తురకపల్లిలో అమీర్ బాషా అనే రైతు పేరు మీద (జాబ్ కార్డు నంబరు 160058) ఆ రైతుకు తెలియకుండానే స్థానిక టీడీపీ నేత ఒకరు బౌండరీ ట్రెంచ్‌లు తవ్వినట్టు (వర్క్ ఐడీ నంబర్ 11834245)గా బిల్లులు చేశారు. అక్కడ ఎలాంటి ట్రెంచ్‌లు తవ్వకుండానే సుమారు రూ. 69 వేలు ఉపాధి నిధులను కాజేశారు. ఆ విషయం సదరు రైతుకు తెలిసి ఏపీఓను నిలదీయగా స్థానిక టీడీపీ నేత ద్వారా ఆ రైతుకు సగం డబ్బు ఇప్పించి వివాదం బయటకు రాకుండా సర్దుబాటు చేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికీ ఆ రైతు పొలం చుట్టు బౌండరీ ట్రెంచ్‌లు మాత్రం తవ్వక పోవడం విశేషం.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

చంద్రగిరి : స్థానిక ఏరియా ఆసుపత్రిని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ బీసీకే.నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిశుభ్రత, అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రికి రోజూ వస్తున్న రోగుల సంఖ్య, వాటికి సంబంధించిన ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. చంద్రగిరి ఏరియా ఆసుపత్రిలో రోగులకు మరింత మెరుగ్గా వైద్య సేవలను అందించాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రతతో పాటు సకాలంలో వైద్య పరీక్షల ఫలితాలను అందించి, రోగులకు మానసిక ధైర్యాన్ని కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ ఆనంద మూర్తి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

తిరుపతి లీగల్: చిత్తూరులో న్యాయవాది సుధాకర్‌పై దాడి, రేపల్లెలో న్యాయవాదుల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు హత్యను నిరసిస్తూ తిరుపతి న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్టు తిరుపతి న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు తెలిపారు. తిరుపతి న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు గురువారం సమావేశమయ్యారు.

జులై 5న కృత్రిమ కాళ్ల కొలతల క్యాంప్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని దివ్యాంగులకు జూలై 5వ తేదీన కృత్రిమ కాళ్ల కొలతల క్యాంప్ నిర్వహించనున్నట్లు విభిన్నప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరులోని తపోవనం పాఠశాలలో కృత్రిమ కాళ్ల క్యాంప్ నిర్వహించి, కొలతలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈక్యాంప్‌ను కొత్తగా కృత్రిమ కాళ్లు అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్యాంప్ నిర్వహించిన 20 రోజుల తర్వాత ఉచితంగా ఆధునిక కృత్రిమ కాళ్లను అమర్చడం జరుగుతుందన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్, వైకల్యం కనిపించేలా రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఫోన్ నంబర్‌తో విచ్చేయాలన్నారు. ఇతర సందేహాలకు 9440357522, 6281486722 నంబర్లలో సంప్రదించాలని ఏడీ వెల్లడించారు.

30 నుంచి పాలిసెట్ వెబ్ ఆప్షన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిసెట్‌లో ర్యాంకులు సాధించి సర్టిఫికెట్ల పరిశీలన ముగించుకున్న విద్యార్థులకు ఈనెల 30వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇదివరకు 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించాల్సిన వెబ్ ఆప్షన్ ప్రక్రియను 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తిరుపతి కేటీ.రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా గురువారం 86,001వ ర్యాంకు నుంచి 1,04,001వ ర్యాంకు వరకు నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు తిరుపతిలో 201 మంది, గూడూరులో 53 మంది, సత్యవేడులో 10 మంది మొత్తం 264 మంది విద్యార్థులు హాజరై తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం 1,04,001వ ర్యాంకు నుంచి లక్షా 20 వేలు ర్యాంకు వరకు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలన చేయనున్నట్లు పేర్కొన్నారు.

గ్రీవెన్స్‌కు నోడల్ అధికారులు

- పీజీఆర్ఎస్‌లో పలు మార్పులకు శ్రీకారం
- రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జయలక్ష్మి సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి. జయలక్ష్మి

తిరుపతి అర్బన్: పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని...అయితే ఆ స్థాయిలో అర్జీలు పరిష్కారం అయ్యేలా అధికారులు చూడాలని అందుకు మండల స్థాయిలో నోడల్ అధికారిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి. జయలక్ష్మి వెల్లడించారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఆమె గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలసి మండల, డివిజన్, జిల్లా రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ గ్రీవెన్స్ నిర్వహించాలని, శనివారం కోర్టు కేసులు పరిష్కారం పనిచేయాలని, మంగళవారం నుంచి శుక్రవారం వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్‌లో మార్పులు చేయనున్నామని రెండు రోజుల్లో స్పష్టంగా తెలియజేస్తామని పేర్కొన్నారు. మండల స్థాయిలో సోమవారం మధ్యాహ్నం వరకు గ్రీవెన్స్ నిర్వహించాలని.. మధ్యాహ్నం తర్వాత తహసీల్దార్ నేతృత్వంలో రెవెన్యూ సిబ్బందితో కూర్చుని ఆ రోజు వచ్చిన అర్జీలు పై వారంలోపు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి సోమవారం జరిగే సమావేశానికి సంబంధించిన మినిట్స్ రికార్డ్ చేసుకుని ఉంచుకోవాలని, వాటి వివరాలను ఆర్డీఓకు పంపాలన్నారు. మ్యుటేషన్లకు సంబంధించిన ప్రక్రియ, కుల ధ్రువీకరణ జారీ అంశాల్లో తప్పిదాలకు తావివ్వరాదన్నారు. వెబ్ ల్యాండ్ సంబంధించి ఏ ఎంట్రీ అయినా తహసీల్దార్ పరిశీలించాలన్నారు. ఆగస్టు 15 లోపు పట్టాలు ఇచ్చేలా జిల్లాలోని 34 మండలాల్లో కనీసం 10 నుంచి 16 మండలాల్లో కొన్ని గ్రామాల్లోనైనా ఈ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. పోలీస్‌శాఖ వారికి 70 శాతం భూ సమస్యలతో వచ్చే వివాదాలతోనే సరిపోతుందని...దాంతో శాంతి భద్రతలు తలెత్తే ప్రమాదం ఉందని గుర్తుచేశారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాం

దీర్ఘకాలంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేయడం జిల్లాలో లేదని తెలిపారు. శాంతి భద్రత సమ స్యలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్ఓ నరసింహులు, తిరుపతి,శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు బి రామమోహన్, భాను ప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్, కలెక్టరేట్ లోని వివిధ విభాగాలకు చెందిన సెక్షన్ అధికారులు, డిప్యూటీ కలెక్టర్లు,జిల్లాలోని తహసీల్దారులు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ పరిశ్రమలో గాయపడిన కార్మికుడు మృతి

పెళ్లకూరు : మండలంలోని పెన్నేపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వలస కార్మికుడు జురాల్ యాదవ్(47) గురువారం మృతి చెందినట్లు ఏఎస్ఐ రాఘవయ్య తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు ఈనెల 24న స్టీల్ పరిశ్రమలోని పర్నేజ్ ప్లాంట్ వద్ద ఐరన్ లిక్విడ్ ద్రావణం ఉబికి అక్కడ పని చేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు జురాల్ యాదవ్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం చెన్నైకి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధితుడికి భార్య , ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాయుడుపేటలో చోరీ

– 16 గ్రాముల బంగారు నగలు అపహరణ


బీరువా లోపలి అర తెరిచేసి చోరీ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు


ఇంటిలోనే వదిలిపెట్టిన బంగారు తాళిబొట్లు ఉన్న డబ్బా

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని రాజగోపాలపురం వీధిలో గురువారం సాయంత్రం ఓ ఇంటిలో చోరీ జరిగింది. బీరువాలో దాచి ఉంచిన 16 గ్రాములు బంగారు నగలు (2 సవర్లు) గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారు. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు.. పట్టణంలోని రాజగోపాలపురం వీధిలో సిద్దలయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. సిద్దలయ్య ఆర్టీసీ బస్టాండులోని దుకాణంలో పనిచేస్తుంటాడు. గురువారం మధ్యాహ్నం సిద్దలయ్య కుటుంబ సభ్యులతో కలిసి సొంతపని మీద బయటకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటి వచ్చేసరికి తలుపుల తాళాలు పగలగొట్టి ఉండడం గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలో ప్రవేశించి బీరువా తాళాలు సైతం పెకలించి, రెండు సవర్లు బంగారు నగలు చోరీకి గురైందని బాధితులు గుర్తించారు. బీరువాలో ఉన్న బంగారు తాళిబొట్లు అక్కడే వదిలిపెట్టినట్లు తెలిపారు. ఈ విషయమై బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి ఐడీ పార్టీ పోలీసులతో చోరీ జరిగిన ఇంటి వద్దకు వెళ్లి పరిశీలన చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎర్రచందనం కేసులో ఆరుగురికి ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్: అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి, ఎర్రచందనం చెట్లను నరికి, దుంగలను తరలించడానికి ప్రయత్నించిన కేసులో ఆరుగురికి ఒక్కొక్కరికి ఐదేళ్ల చొప్పున జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ జడ్జి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. తిరుపతి జిల్లాకు చెందిన చాంద్ బాషా, అవినాష్, మర్రిచెట్టు నాగరాజు, ధనశేఖర్ అలియాస్ ధనుంజయులు, వరదరాజులు అలియాస్ వరదయ్య, మూడే నాగరాజు అలియాస్ నాగరాజు నాయక్ 2017లో శేషాచలం అటవీ ప్రాంతం, కరకంబాడి ఫారెస్ట్ బీట్, టీఎస్ పాలెం సెక్షన్, ఎస్వీఎన్‌పీ రేంజ్ అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి, ఎర్రచందనం చెట్లను నరికి దుంగలను తరలించడానికి ప్రయత్నించారు. వారిని టాస్క్‌ఫోర్స్ ఫారెస్ట్ సిబ్బంది అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

పాముకాటుకు గురైన విద్యార్థిని

నారాయణవనం: మండలంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థిని గురువారం పాముకాటుకు గురైంది. వివరాలు.. పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న తేజశ్రీ(11) ఉదయం 11 గంటలకు మలవిసర్జన కోసం పాఠశాలలోని మరుగుదొడ్డికి వెళ్లింది. తలుపులు తెరవడంతో లోపలున్న పాము తేజశ్రీ కాలుపై కాటు వేసింది. హెచ్ఎం మనోహరి పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు. విష సర్పం కాకపోవడంతో తేజశ్రీకి ప్రమాదం తప్పింది.

బడికి రాకుండా నిరసన

చిల్లకూరు : బడుల విలీనానికి నిరసనగా విద్యార్థులు తరగతులను బహిష్కరించిన సంఘటన గూడూరు రూరల్ ప్రాంతంలోని నెర్నూరు గ్రామంలో చోటుచేసుకుంది. నెర్నూరులో చదువుతున్న 6,7,8 తరగతులకు చెందిన సుమారు 40 మంది విద్యార్థులను తిరువెంగళాయపల్లి పాఠశాలకు వెళ్లాలని విద్యాశాఖాధికారులు ఆదేశాలు ఇచ్చారు. అలాగే నెర్నూరుకు 3 కి.మీ దూరంలో ఉన్న గొల్లపల్లి, పుట్టంరాజుకండ్రిగ గ్రామాలల్లోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 3,4,5 తరగతుల పిల్లలను నెర్నూరుకు వెళ్లాలని అధికారులు తెలిపారు. దీంతో పాఠశాలలు పునఃప్రారంభించి 15 రోజులు అవుతున్నా విద్యార్థులు బడికి వెళ్లకుండా బహిష్కరించారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలను బడికి పంపేది లేదని చెబుతున్నారు. దీంతో పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన విద్యా సామగ్రి గదుల్లో బెంచీల మీదనే ఉంచేశారు. పిల్లలు బడికి రాకపోవడంతో టీచర్లు ప్రతి రోజు బడికి వెళ్లి హాజరు వేసుకుని వస్తున్నారు. దీనిపై పాఠశాల హెచ్ఎం వరలక్ష్మిని వివరణ కోరగా దూరంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలకు పంపలేమని ప్రైవేటు పాఠశాలకు తమ పిల్లలను పంపుతామని తల్లిదండ్రుల చెబుతున్నారని అన్నారు.


15 రోజులుగా బెంచీలపైనే విద్యా సామగ్రి

మత్తుకు యువత బానిస కావొద్దు


ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ

తిరుపతి సిటీ : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వాటిని దరిచేరనిస్తే బంగారు భవిష్యత్తుకు ముగింపు పలికినట్టేనని ఎస్వీడబ్ల్యూ ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ పేర్కొన్నారు. పద్మావతి మహిళా డిగ్రీ , పీజీ కళాశాలలో మాదక ద్రవ్య నివారణ, ర్యాగింగ్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ మాదక ద్రవ్య నివారణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. యువత ఉన్నత లక్ష్యం వైపు పయనించాలే తప్ప, జీవితాన్ని నాశనం చేసే డ్రగ్స్, మత్తుకు బానిస కావొద్దన్నారు. మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హేమావతి ×డ్రగ్ అబ్యూస్ఙ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా యువత తమ జీవితాన్ని ఎలా నాశనం చేసుకుంటున్నారో వివరించారు. అనంతరం కమిటీ కన్వీనర్ డాక్టర్ వసుధ విద్యార్థినులతో మాదకద్రవ్యాల జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ జయశ్రీ, డాక్టర్ లక్ష్మి సంధ్య, డాక్టర్ వరప్రసూన, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భద్రమణి, ఐకసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉమారాణి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు